పుస్తకాలొచ్చేశాయ్

- పాఠశాలలకు చేరుకున్న సెమిస్టర్ టెక్ట్స్ బుక్స్
- శరవేగంగా పంపిణీ


ఎండీఎం వ్యాన్‌లో పాఠశాలలకు పుస్తకాల తరలింపును పర్యవేక్షిస్తున్న అధికారులు


చౌంపి పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం కన్నబాబు

అరకులోయటౌన్: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునః ప్రారంభమైన రోజు నుంచే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌ల పంపిణీ శరవేగంగా జరిగింది. తరగతులు ఆరంభం కాకుండానే ముందస్తుగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, స్కూల్ బ్యాగులు వంటివి ప్రభుత్వం అందజేసింది. పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమ్మఒడి సొమ్మును తల్లుల ఖాతాకు జమ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సెమిస్టర్ విధానం సక్రమంగా కొనసాగిలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మూడు నెలలు ముందుగానే సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేస్తోంది.

ఆనందంలో విద్యార్థుల తల్లిదండ్రులు

అరకులోయ మండలంలో విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నూరు శాతం పూర్తయింది. ఒకటవ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వివిధ రకాలుగా సెమిస్టర్ బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒకటి నుంచి మూడవ తరగతి వరకు మ్యాథ్స్, నాలుగు, ఐదు తరగతులకు ఈవీఎస్, ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈవీఎస్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి రెండో సెమిస్టర్ పుస్తకాలు అందించారు. అరకులోయ మండలంలో సుమారు 11,674 విద్యార్థులకు పుస్తకాల పంపీణీ పూర్తి చేశారు. మండలంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలకు చెందిన 11,674 మంది విద్యార్థులకు 1,02,673 పుస్తకాలను అందించారు. పుస్తకాల పంపిణీ ఆలస్యం కాకుండా ఉండేందుకు పౌర సరఫరా బియ్యం పంపిణీ చేసే వ్యాన్‌ల ద్వారా పాఠశాలలకు చేరవేసేందుకు ఐటీడీఏ పీవో ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎంఈవోలు, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పుస్తకాలను సక్రమంగా పాఠశాలలకు చేర్చే విధంగా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు ముందుగానే ప్రకటించిన విధంగా పుస్తకాలు పంపీణి చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు మాసాల ముందుగానే

మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది విద్యాబోధన రెండు సెమిస్టర్లుగా నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. నవంబర్ మొదటి వారం నుంచి రెండో సెమిస్టర్ ప్రారంభం కానుంది. నాలుగు మాసాల ముందుగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది.

పూర్తయిన లక్ష్యం



రెండో సెమిస్టర్‌కు సంబంధించి మండలంలో పుస్తకాల పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేశాం. ప్రభుత్వం సకాలంలో పుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఆదేశాలకు అనుగుణంగా అన్ని పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ ప్రక్రియను ముగించాం.
– వంతాల త్రినాథరావు, ఎంఈఓ, అరకులోయ

క్లుప్తంగా

3న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్


ప్రిన్సిపాల్, రాజారావు

చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి సంబంధించి రెండవ విడత కౌన్సెలింగ్ ఆగస్టు 3న నిర్వహించునున్నట్టు ప్రిన్సిపాల్ రాజారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో చింతపల్లి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9866108607, 9494377833 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్‌ఐగా రఘునాథరావు బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన రఘునాథరావు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి స్టేషన్ ఎస్‌ఐ టి.ఘునాథరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ షరీఫ్ కాకినాడ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కొత్తగా వచ్చిన ఎస్‌ఐ రఘునాథరావు స్థానిక సీఐ బాజిలాల్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. సిబ్బంది కొత్త ఎస్‌ఐకు ఆహ్వానం పలికారు.

సచివాలయ పనుల పరిశీలన


సచివాలయ పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

వై.రామవరం: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి శనివారం పరిశీలించారు. నాణ్యమైన రంగులతో పనులు వేగవంతంగా పూర్తి చేయించామని, పనులు చేయిస్తున్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈవోపీఆర్‌డీ మధుసూదనరాజు, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు-లారీ ఢీ: ట్రాఫిక్‌కు అంతరాయం


ప్రమాదానికి గురైన లారీ, కారు

అరకులోయటౌన్: మండలంలోని కొత్తభల్లుగుడ మలుపు వద్ద శనివారం కారు, లారీ ఢీకొన్నాయి. విశాఖపట్నం వైపు నుంచి అరకులోయకు వస్తున్న కారు, అరకులోయ నుంచి అనంతగిరి వైపు కంకర చిప్స్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగం నుజ్జు అయ్యింది. ఈ సంఘటన మలుపు వద్ద జరగడంతో కొంత సేపు ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది.

సీఆర్‌టీల నూతన కార్యవర్గం ఎన్నిక


సీఆర్‌టీల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ జిల్లా నూతన కార్యవర్గం శనివారం ఏర్పాటైంది. సీఆర్‌టీల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా పెండెలి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా టి.సత్యనారాయణ,కోశాధికారిగా ఎం.సత్యనారాయణనాయుడుతో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఎన్నికల కమిటీ ప్రతినిధులు మోహనరావు, బాలకృష్ణ, సత్యనారాయణ, భాస్కరరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎంపికను ప్రశాంతంగా నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం


గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయటౌన్: మండలంలోని పెదబబుడు మేజర్ పంచాయతీ ఆర్.డుంబ్రిగుడ గ్రామంలో కమ్యూనిటి హాల్, రచ్చబండ నిర్మాణానికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హామీ ఇచ్చారు. గ్రామ గిరిజనులు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలు వివరించారు. గ్రామంలో కమ్యూనిటి హాల్, రచ్చబండ లేకపోవడంతో శుభకార్యలు, సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, స్థానికుల శ్రమదానంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పునాదులు వేసి, గోడలు కట్టామని, రచ్చబండ నిర్మాణానికి రేకులు, నగదు సహాయం చేయాలని గ్రామస్తులు అర్జున్, సుబ్బారావు, గోపాల్, లొక్కినాథ్‌లు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తొలి ప్రాధాన్యమిస్తామన్నారు. రచ్చబండ కోసం అవసరమైన సిమెంట్ రేకుల గురించి ఆరా తీయాలని వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ భీమరాజు, ఇన్‌చార్జి పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మజ్జి గురుకు సూచించారు. ఈ మేరకు 30 రేకులు అవసరమున్నట్టు తెలియజేశారు. ఆయా రేకులు సమకూరుస్తామని ఎమ్మెల్యే అంగీకరించారు. గ్రామంలో రచ్చబండ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే పాల్గుణకు అభినందనలు తెలిపారు.

ఫీడర్ అంబులెన్స్‌లతో మెరుగైన సేవలు


ఏడీఎంహెచ్‌ఓ భాస్కర్‌ను కలిసిన ఫీడర్ అంబులెన్స్ కో-ఆర్డినేటర్, సిబ్బంది

రంపచోడవరం: ఏజెన్సీ లోతట్టు ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా వెళ్లి రోగులను సకాలంలో ఆస్పత్రులకు తరలించడంలో మెరుగైన సేవలందిస్తున్నట్టు రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు అన్నారు. ఫీడర్ అంబులెన్స్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, సత్తిబాబులు ఏడీఎంహెచ్‌ఓను కలిశారు. ఈ సందర్భంగా ఫీడర్ అంబులెన్స్‌లు ద్వారా ఏజెన్సీలో అందిస్తున్న సేవలను వివరించారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని సిబ్బంది తెలిపారు.

మతోన్మాదం దేశానికే ప్రమాదం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అరకులోయ రూరల్: కేంద్రంలో బీజేపీ మతోన్మాదంతో వ్యవహరిస్తున్న తీరు దేశానికే ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆరోపించారు. శనివారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వల్ల ఆదివాసీ గిరిజనులకు ఒరిగిందేమి లేదన్నారు. ఆదిమజాతి (పీవీటీజీ) గిరిజనులకు ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నా ఏ ఒక్కరికి అందడం లేదని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ ప్రజలకు అడవిపై ఉన్న హక్కులను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసర సరకులు ధరలు పెరిగాయని, గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు సక్రమంగా లేవన్నారు. దీనివల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందడం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలంతా ఒకే తాటిపై లేకుంటే దేశం మరో మణిపూర్‌గా మారుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో మేలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స, అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, సీపీఎం నేతలు సురేంద్ర, రామారావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు


రంపచోడవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మోహన్

రంపచోడవరం: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని రంపచోడవరం ఎస్‌ఐ మోహన్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. కొంతమంది అతి వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా కేసు నమోదు చేస్తామన్నారు. ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. నిబంధనలు ప్రకారం ప్రయాణికులను ఎక్కించుకుని మోటార్ చట్టానికి లోబడి ప్రయాణించాలన్నారు. లేకుంటే కేసులు తప్పవన్నారు. 18 సంవత్సరాలు లోపు వయస్సు వారికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు.ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చే వారు రోడ్డుపై ఉన్న సూచనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు.

అంగుళూరు వాసులు అధైర్యపడొద్దు


అంగుళూరు గ్రామస్తులకు మాట్లాడుతున్న ఎంపీపీ కుంజం మురళీ తదితరులు

దేవీపట్నం: పూడిపల్లి పంచాయితీలోని అంగుళూరు గ్రామాన్ని శనివారం అధికారులు, ప్రజా ప్రతినిధులు సందర్శించారు. గోదావరి వరదల కారణంగా అంగుళూరు గ్రామం వద్ద గల స్లూయిజ్ లీకై వరదనీరు పంట పొలాలను ముంచెత్తింది. గ్రామానికి చెందిన దాదాపు 70 ఎకరాల వరిపంట నీట మునగడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఎంపీపీ కుంజం మురళీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కందుల బాబ్జి , డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ఎస్‌ఐ నాగార్జునలు గ్రామాన్ని సందర్శించారు. ఇరిగేషన్ అధికారులను సంప్రదించి స్లూయిజ్ కు తాత్కాలికంగా అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి అధైర్య పడవద్దని ముంపునకు గురైన పంటకు నష్టపరిహారం అందించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ గారపాటి మురళీకృష్ణ, యూత్ అధ్యక్షుడు కోసు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో రోగుల తాకిడి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోజు రోజుకు రోగుల తాకిడి పెరుగుతూ వస్తుంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వ్యాధుల బారిన గిరిజనులు పడుతుండడంతో ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. శనివారం ఒక్కరోజే స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓపి 216గా నమోదు అయింది. గత వారం రోజులలో 1034 మంది సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందారు. వైద్యాధికారులు వివేక్, ధరణిలు పరీక్షలు చేసి వైద్య సేవలందించారు. ఆస్పత్రి ప్రాంగణంలో రోగులతో నిండిపోవడంతో పాటు రక్తపరీక్షల గది ఎదుట రోగులు బారులు తీరారు. గ్రామాల్లో రోగులు సంఖ్య పెరుగుతుండడంతో కిలగాడ, లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీలా పరిధిలో వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు అధికంగా నిర్వహిస్తున్నారు.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజన గ్రామాల్లో వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

13 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం


నిమ్మవీథిలో పంటల క్షేత్రాన్ని పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ నిట్టాపుట్టు ఇన్‌చార్జి ప్రసాద్

జి.మాడుగుల: మండలంలోని 13 పంచాయతీల్లోని 32 గ్రామైక్య సంఘాలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాయని రైతు సాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్ తెలిపారు. నిమ్మవీధి, పాలకొండ గ్రామాల్లో పంటలను ఆయన శనివారం పరిశీలించారు. రైతులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు. మూడు నెలలు ముందు పీఎండీఎస్ వేయించటం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా వరి, పసుపు, కాఫీ, మిరియాలు, రాజ్మా కాగా, పుసుపు పంటలో 15 నుంచి 25 రకాల అంతర పంటలు వేయించినట్టు చెప్పారు. దశల వారీగా రైతుకు ఏదో ఒక పంట వస్తుందని, వాని వలన రైతుకు వారానికి కనీసం రూ.300–రూ.500 మిగులుతుందని అలా సంవత్సరానికి 52 వారాల్లో సుమారు ఒక్కొక్క కుటుంబానికి రూ.27వేలు ఆదాయం సమకూరుతుందన్నారు. యూనిట్ ఇన్‌చార్జి పాపారావు, ఐసీఆర్‌పీఎస్ కె.మత్స్యమ్మ, కె.సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏడీ


ఎమ్మెల్యే పాల్గుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీ నరసింహులు, పశు వైద్యులు

అరకులోయటౌన్: పశుసంవర్థక శాఖ ద్వారా గిరిరైతులకు మెరుగైన సేవలు అందించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ నరసింహులు, సిబ్బందితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ఉద్యోగులు స్థానికంగా ఉండి గిరిరైతుల పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు వచ్చే వ్యాధులను గుర్తించి వైద్యసేవలందించి పశుసంపదను కాపాడాలని సూచించారు. అరకులోయ పశుసంవర్థకశాఖ పరిధిలోని ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఏడీ నరసింహులకు సూచించగా వారం రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. ఇప్పటివరకు 3,500 పశువులకు ఇన్సూరెన్స్ చేయించినట్లు ఏడీ వివరించారు. పీవీటీజీలకు పశుబీమా వర్తింపజేయాలని కోరుతూ పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్‌కు నివేదిక అందజేశామన్నారు. అరకులోయ, అనంతగిరి పశువైద్యాధికారులు కె.సీనయ్య, సందీప్, వీఎల్ఓ జె.సాంబశివరావు తదితరులున్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి


చిన్నారులకు గిఫ్టులు అందజేస్తున్న సామాజిక సేవ కార్యకర్తలు సాల్మన్, సుజాత దంపతులు

అరకులోయ రూరల్: సామాజిక సేవతోనే నిజమైన సంతృప్తి కలుగుతుందని సామాజిక సేవ కార్యకర్తలు సాల్మన్, సుజాత దంపతులు చెప్పారు. మండలంలో కొత్తభల్లుగూడ పంచాయతీ జనంగూడ గ్రామంలో శనివారం 60 మంది నిరుపేద విద్యార్థులకు సామజిక సేవ కార్యకర్తలు సాల్మన్, సుజాత దంపతులు ఉచితంగా పెన్నులు, నోట్‌పుస్తకాలు,పెన్సిళ్లు, పౌష్టికాహార సరకులు, సుమారు 25 రకల వస్తువులు అందజేశారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పేద విద్యార్థులకు తోచిన సాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారి సేవలను స్థానికులు అభినందించారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు ముమ్మరం


చింతూరులో నీట మునిగిన శబరిఒడ్డు ప్రాంతం


కూరగాయలు తరలిస్తున్న లాంచీ


కూరగాయల సరఫరాను పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

విలీన మండలాల్లో ముంపు గ్రామాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఆయా ప్రాంతాలకు లాంచీలు, పడవల్లో కూరగాయాలు తరలించారు. సహాయక చర్యలను చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే పర్యవేక్షించారు. – చింతూరు/వీఆర్.పురం, కూనవరం/ఎటపాక

మావోయిస్టుల వారోత్సవాలకు వ్యతిరేకంగా పోస్టర్లు


మోహనాపురం సమీపంలో పోస్టర్

గంగవరం : మావోయిస్టుల వారోత్సవాలకు వ్యతిరేకంగా మండలంలోని మోహనాపురం పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల వాల్ పోస్టర్లు వెలిశాయి. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్‌ల నెపంతో చంపుతున్నారని, బస్సులను ధ్వంసం చేసి, గిరిజనులకు రవాణా సదుపాయం లేకుండా చేస్తున్నారని... గిరిజనులకు ఉపయోగపడని మావోయిస్టు వారోత్సవాలు వద్దు.. అంటూ నినాదాలతో అల్లూరి ఆదివాసీ యువజన సంఘం రూపొందించిన పోస్టర్లు జడేరు–మోహనపురం రహదారిలో దర్శనమిచ్చాయి.

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు మారుమూల కుమడ, బూసిపుట్టు,బాబుసాల, లక్ష్మీపురం,వనుగుమ్మ,రంగబయలు పంచాయతీల్లోని పలు గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు శనివారం ఉదయం దర్శనమిచ్చాయి. మా అభివృద్ధి అడ్డుకొని వారోత్సవాలు జరుపుకుంటారా.. అందుకే వారోత్సవాలు వద్దు–మాకు అభివృద్ధి ముద్దు .. అంటూ మావోయిస్టులు చేసిన విధ్వంస ఫోటోలతో అల్లూరి అదివాసీ అభివృద్ధి సమితి పేరుతో వాల్ పోస్టర్లు దుకాణాలు, బ్యాంకుల గోడలకు అతికించారు.

5న ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీగ్రంథాలయం ఆధ్వర్యంలో ఆగస్టు 5న విశాఖ జిల్లా అగనంపూడి హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం సహకారంతో 'ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్' నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయం కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతశెట్టి, విశిష్ట అతిథిగా ప్రివెంటివ్ అంకాలజీ, హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి హెచ్‌వోడీ డాక్టర్ డోల్ రోసా ఫెర్నాండేజ్ పాల్గొనున్నట్టు చెప్పారు. స్క్రీనింగ్ పరీక్షలు అదేరోజు ఉదయం 9 నుంచి 1 గంట వరకూ నిర్వహిస్తారని, ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల


శిథిలస్థితిలో ఉన్న మొల్లేరు గ్రామీణ పశు వైద్యశాల భవనం

గంగవరం : మొల్లేరు గ్రామంలోని గ్రామీణ పశు వైద్యశాల భవనం శిథిలస్థితికి చేరుకొని ప్రమాదభరితంగా ఉంది. ఈ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతూ, తలుపు, కిటికీలు చెడిపోయి ఏ సమయంలో కూలిపోతుందో తెలియని స్థితిలో ఉందని స్థానికులు చెబుతున్నారు. శిథిల భవనంలోనే ఈ భవనంలోనే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్యశాలకు నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.